

# ప్రేమమూర్తి

కిళాంబి కృష్ణమాచార్య

షుమారు 7 గంటలు కావస్తోంది. మండు వేసగి యందలి నిండు పున్నమి రేయి. శశాంకుడు గర్వంగా తన చంద్రికల వెదజల్లుచూ గగన మార్గంబున స్వేచ్ఛగా విహారము చేస్తున్నాడు. సముద్రుడు తన ప్రాణసఖుని ఆగమనముచే సంతోషంతో ఉప్పొంగి పోతున్నాడు. చల్లటి వాయువులు మందంగా వీస్తూ ఉంటాయి.

ఆరోజుల్లో నేనూ, మా వేణూ మెడికలు కాలేజీలో చదువుచుండేవాళ్లం. సాయంత్రము కావటంతోటే రోజూ బీచికి తయారు. సముద్రపు ఒడ్డునే చాలదూరం నడిచి ఇసుక తిన్నెలలో చతికిలపడి వచ్చే పొయ్యేవాళ్లను చూస్తుండేవాళ్లం. ఆరోజు మామూలు మాదిరిగానే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. మా ప్రక్కనుంచే పాతిక వత్సరాల యువకుడొకడు విచారంగా నడిచి వెళ్లుచున్నాడు. అతని ప్రక్కనే ఒక యువతి త్రోపుడుబండీలో ఆసీనయైంది. సేవకుడొకడు బండిని మెల్లగా నెట్టుచున్నాడు. యువకుడు మాటి మాటికి ఆమెవంక చూస్తూ కన్నీరు విడుస్తున్నాడు. ప్రకృతి లోకాన్నంతా ఆనందాబ్ధిలో నోలలాడించ గలిగినను ఆ యువకునికి మట్టుకు ఆహ్లాదమును సమకూర్చలేక పోయింది. ఆమెకు షుమారు ఇరువది సంవత్సరము లుండును సన్నగా తటిల్లతవలె మెఱసిపోతోంది. నల్లటి సముద్ర తరంగముల బోలిన ముంగురులు గాలికి అల్లలాడు చున్నాయి. ఆమె మాటి మాటికి ముఖము పైబడు ముంగురులపైకి త్రోసికొనుచు ప్రకృతి సౌందర్యాన్ని విలోకిస్తోంది.

"వేణూ! ఆ యువకుడు దుఃఖపీడితుడై యుండుటకు కారణ మేమైయుండునో గదా?"

వేణు మాటాడలేదు. కళ్లవెంట గిర్రున నీళ్లు తిరిగాయి. సముద్ర తరంగముల వంక దీర్ఘంగా చూస్తూన్నాడు. మా వేణు విచారంగా కనపడుట అదే ప్రథమ పర్యాయము. అతని మనస్సును భేదింపచేయు విషయమేదో నాకు అర్థం కాలేదు. అతని కోమలమగు మనస్సును నొప్పించినందుకు అప్రయత్నంగా దుఃఖము పొరలు కొచ్చింది.

"అదియొక విషాదమగు పెద్దగాథ. ఆ యువకుడుకూడ ఒకప్పుడు విషాదమనునది ఎరుగక జీవితము అనుభవించిన వాడే. కాని..."

అని ఏదో చెప్పబోయి చెప్పలేక కాబోలు నిట్టూర్పు విడిచి ఊరుకున్నాడు.

రెండు నిముషములపాటు నిశ్శబ్దంగా కూర్చున్నాము. కాని మనస్సునందలి ఆ వేదనను పట్టలేక ఆ యువకుడే విషాదగాథ చెప్ప మొదలు పెట్టాడు.

ఆ యువకుడొక చిత్రకారుడు. పేరు కుమార్ ఇప్పుడు బండియందున్న యువతి అతనిభార్య. వారిద్దరకు వివాహమై షుమారు ఐదేండ్లు కావస్తోంది. కుమార్, నేనూ చిన్ననాటి స్నేహితులం. అందువల్ల అతని ఇంటికి అప్పుడప్పుడు వెళ్తుతుండేవాణ్ణి.

సాయంత్రము షుమారు ఆరుగంటలు కావస్తోంది. నదీ తీరానికి షికారుగా బయలుదేరాం, నేనూ కుమార్ ఇందిరన్నూ. అప్పుడే నభోమణి పశ్చిమాద్రి గ్రుంకుచున్నాడు. ప్రకృతి చాల ప్రశాంతముగా ఉంది. సమీపమందున్న కుసుమ గుచ్ఛములు తమ సౌరభములను వెదజిమ్ముచున్నాయి.

చాలదూరం ఒకరితో నొకరు మాటాడకుండానే సాగిపోతున్నాం. ఇందిరమటుకు అప్పుడప్పుడు వెనక పడుతుండేది. మళ్లావచ్చి కలుసుకుంటుండేది.

"సంధ్యారాగము ఎంత చక్కగా నున్నదో చూచారా" అని ప్రశ్నించింది.

కుమార్ దానివంక చూడకుండగనే 'ఆహా' అని జవాబిచ్చాడు.

"మీరు అటు చూడకుండానే ఆహా అంటున్నారు గదూ" అంది నిష్ఠూర్యంగా.

"నిజమేగాని, ఈ దృశ్యము చాల బాధను కలిగించుచున్నది. అందువల్లనే దానిని గూర్చి ఆలోచించటం లేదు" అన్నాడు చిరునవ్వుతో.

"అయితే ఊరి ప్రయాణము చేస్తేనా" అంది.

"నాకు తెలియదు"

ఈ జవాబు వినునప్పటికి ఆమెకు కోపము హెచ్చైపోయింది.

"ఏవిషయం మాట్లాడకుండా ఇట్లా ఎంత దూరమని నడవటం" అంది ఇందిర కొంచెము విసుగుతో; అతడు మారు పలుకలేదు. అతనికి కోపం వచ్చిందేమోనని సన్నటి కంఠంతో ఒక కృతి నొకదాని నందుకుంది.

అతడు సణుగుతూ "కొంచెము ఊరుకుందూ" అన్నాడు.

"..................

"ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించకుండా పాడు చేస్తున్నావు" అని అన్నాడు కుమార్.

దానితో ఆమెకోపం పట్టలేక పోయింది. ఏమి మాటాడుచున్నది ఆమెకు తెలియలేదు. క్రోధము ఆమె మనోనైర్మల్యమును కలచివైచింది. అణచుకొనుటకు ప్రయత్నించింది. కాని అశక్తురాలయింది. దానికి సరియగు మార్గము చూపనిచో ఆమెనే దహించివేయునని ఊహించింది. అతనిని దూషించుట వల్ల

కాలా దాహశమనము గల్గంద. కాని ఝంఝూమారుతము వీచిన విధవవర్తించినట్లు, కుమార్ ను తనివితీర దూషించిన పిదప, పశ్చాత్తాపమును అశ్రుధారల రూపకముగా వెలువడించింది. కాని చిత్రకారుని నోటనుండి ఒక్కమాట యైనను వెలువడలేదు. ఒకరితో నొకరు మాటాడకుండానే గృహము చేరాము.

ఇప్పుడతని జీవితము దుఃఖభాజనమై పోయింది. ఆమె సతతము అతనియందు లోపము లెన్నుట, దూషించుట మొదలగు కృత్యముల అతని సుకుమార హృదయము సహించలేక పోయింది. స్వేచ్ఛకొరకు పరితపించి పోయినాడు. ఎట్లయినను సంసారపరిత్యాగముచేసి కొంత విశ్రాంతి గ్రహింప నిశ్చయించుకొన్నాడు. తనకున్న ఆస్తినంతయు నమ్మివేసి, డబ్బును, విడోల్కులుజాబును బల్లపై వదలి గృహమునుండి బయలుదేరాడు.

సాయంత్రము 3 గంటలు కావస్తోంది. ఎవరో తలుపునెట్టినట్లయింది. వెళ్లి తలుపు తెరిచాను. ఒక స్త్రీవ్యక్తి సుడిగాలి మాదిరి రివ్వున నా ప్రక్కనుండి ఇంట్లోకి ప్రవేసించింది. అది ఆమెయే! ఆమెను చూచుటతోడనే అతనులేచి నిలబడ్డాడు. నోట్లకట్టను అతని కాళ్ల వద్ద గిరాటుపెట్టి " అదుగో మీడబ్బు. నాకు అక్కరలేదు " అంది. ఆమె భయంకరమగు శక్తి స్వరూపిణివలె ఏపని చేయటానికైనా వెనుదీయనట్లు అతని కన్నులకు గోచరించినట్లయింది, తెల్లబోయినాడు.

" నీకేమి కావాలి ?" అన్నాడు కుమార్.

" నాకు మామూలు స్త్రీమాదిరిగా చూడబడటానికి ఇష్టములేదు. నన్ను మీవద్దనే ఉంచుకొనుడు " అంది ఇందిర దీనంగా, నేత్రమూలలనుండి వెలువడు దుఃఖాశ్రుకణములను గోట చిమ్ముతూ.

" అది అసంభవము. అట్లున్నటికి జరుగజాలదు " అన్నాడు కుమార్ నిష్కర్షగా.

ఆమె కన్నులవెంట నీరు జలజల రాలసాగాయి.

" ఇందిరా! అతడు నిన్నింకా ప్రేమిస్తూనే ఉన్నాడు. కాని అతని బంధువర్గము వేరు వివాహము చేసికొనమని బలవంతము చేయుచున్నారని మెల్లిగా చెప్పాను.

ఉలికిపడి " నాకు అంతా తెలిసింది " అని అతనివంక తిరిగి " మీరు నన్నువిడిచి వేరు వివాహము చేసికొంటున్నారన్న మాట "

" అవును తప్పేమి ?"

" మీరు వేరువివాహము చేసికొనినచో, నాకు ఆత్మహత్య తప్పదు "

" అది నీ యిష్టము "

" నామాట నమ్మండి. ఇంక నేను సహించలేను. ఈ కిటికీగుండా దూకి ఆత్మహత్య...."

అతడు విరుగబడి నవ్వసాగాడు. కిటికీవైపు నెమ్మదిగా నడిచివెళ్లి, కిటికీ తెరిచాడు.

''ఇదుగో, ఇక్కడదారి'' అన్నాడు కుమార్. ఆమె ఒక్కక్షణము అతని ముఖమువంక తీక్షణంగా చూచింది. మరుక్షణమున సుడిగాలివలె రివ్వున కిటికీ గుండా మాయమైంది.



నా కన్నులను నమ్మలేక పోయాను. ఆమెను పైకితీసికొని వచ్చారు. ఆమె రెండుకాళ్లు విరిగిపోయాయి. ఇంక ఆమె నడువలేదు; చిత్రకారుడు పశ్చాత్తాపం చెందాడు. తనకొఱకు తన ప్రాణం సహితము ఆహుతిచేయు నిష్కల్మషమగు ప్రేమ మూర్తిని తిలకించాడు. తన కృతజ్ఞతను వెలిబుచ్చుటకు మరల ఆమెనే గృహలక్ష్మిగా స్వీకరించాడు.

చలిగాలి రివ్వున వీస్తోంది. ఆమె గృహమునకు పోనిశ్చయించింది. సేవకుడు బండిని గృహమువైపు త్రిప్పాడు. చిత్రకారుడు ఆమె ప్రక్కనే నడుస్తున్నాడు.

మేము మా హోటలుకు బయలుదేరాం.

మన్మథశాస్త్రము
ముఖ్యముగ అందఱు చదువవలసినది
వెల 8 అణాలు
ది ఓరియంటల్ బుక్ డిపో మద్రాసు